# ముందుమాట

కథ అనేది ఒక కలం కదలిక కాదు.. ఒక మనసు కదలిక. అనుభవం అనే విత్తనం మనసులో పడినప్పుడు, అది ఆలోచనగా మొలకెత్తి, భావంగా పెరిగి, చివరికి కథగా మన ముందుకు వస్తుంది. ఈ పుస్తకంలో ఉన్న పదహారు కథలు అలాంటి మనసు కదలికలే. ఇవి అద్భుతాల కోసం పుట్టిన కథలు కావు. మన చుట్టూ నడిచే సాధారణ జీవితం నుంచే పుట్టిన అసాధారణ క్షణాలు.

ఒక స్కూల్ బెంచ్ దగ్గర, ఒక గుడిసె ముందు, ఒక ఆఫీస్ కారిడార్‌లో, ఒక ప్రయాణం మధ్యలో ఎక్కడో ఒక చోట మనందరం చూసిన, అనుభవించిన, లేదా మౌనంగా దాచుకున్న నిజాలే ఇవి.

ఈ కథల్లో హీరోలు గొప్ప పేర్లు పెట్టుకున్నవాళ్లు కాదు. వాళ్లు మనలాగే సాధారణ మనుషులే. కానీ వాళ్లలోని భయం, వాళ్లలోని ధైర్యం, వాళ్లలోని తప్పు, వాళ్లలోని మార్పు మనల్ని మనకే దగ్గర చేస్తాయి.

ఒక చిన్న అవమానం జీవితాన్ని ఎలా మలిచిందో, ఒక మాట ఒక మనిషిని ఎలా నిలబెట్టిందో, ఒక తప్పు ఒక మంచి పాఠంగా ఎలా మారిందో ఇలాంటి సూక్ష్మమైన నిజాలే ఈ కథల ప్రాణం.

ఇక్కడ హీరోలు ఎవ్వరూ ఆకాశం నుంచి దిగివచ్చిన వాళ్లు కాదు. వీళ్లు మన చుట్టూ తిరిగే మనుషులే.

మన పక్క సీట్లో కూర్చునే ఆఫీస్ ఫ్రెండ్, మన వీధిలో కనిపించే హిజ్రా, మనలానే ప్రేమలో పడిన అబ్బాయి, మనలానే ఓడిపోయి మళ్లీ లేచిన మనిషి.

రచయితగా నాకు ఒక నమ్మకం ఉంది. కథ అనేది పాఠం చెప్పడానికి కాదు, మనసును తాకడానికి ఉండాలి. బోధించాలి అనే ఆతృత కంటే, నిజాయితీగా చెప్పాలి అనే బాధ్యత ఎక్కువగా ఉండాలి.

ఈ పుస్తకంలోని ప్రతి కథ అదే బాధ్యతతో రాసింది. ఎక్కడో నవ్విస్తుంది, ఎక్కడో నిశ్శబ్దంగా ఆలోచింపజేస్తుంది, ఎక్కడో మన గతాన్ని గుర్తుకు తెస్తుంది.

ఈ కథలు చదివేటప్పుడు మీకు తెలిసిన ఎవరో ఒకరు గుర్తొస్తే, లేదా మీరు మీరే ఈ కథలో కనిపిస్తే, లేదా పేజీ మూసిన తర్వాత కూడా ఒక వాక్యం, ఒక భావం, ఒక మౌన ప్రశ్న మీతో పాటు నడిస్తే— అదే ఈ పుస్తకం తన పని చేసినట్టే.

జీవితం ఎప్పుడూ గొప్పగా ఉండదు. చాలా సార్లు అది గందరగోళంగా ఉంటుంది, కొన్నిసార్లు భారంగా ఉంటుంది, కొన్ని సార్లు అర్థం కాకుండా నడుస్తుంది.

కానీ అలాంటి జీవితంలోనే మనసును నిలబెట్టే చిన్న మచ్చలు ఏర్పడతాయి. ఆ మచ్చలే మన గుర్తింపులు అవుతాయి.

'మచ్చుకి' అనే పేరు కూడా అలాంటి ఒక భావన నుంచే వచ్చింది. మనసు మీద పడిన మచ్చ అది బాధ అయి ఉండొచ్చు, లేదా జ్ఞాపకం అయి ఉండొచ్చు, లేదా మనల్ని మార్చిన ఒక క్షణం అయి ఉండొచ్చు.

ఈ పుస్తకంలోని ప్రతి కథ అలాంటి ఒక మచ్చను మీకు ఇచ్చే ప్రయత్నమే.

ఈ కథల్లో ప్రేమ ఉంది కానీ అది సినిమాల్లో చూపించే మెరుపు కాదు. విరిగిపోయాక కూడా నిలబడే ప్రేమ.

ఇక్కడ బాధ ఉంది కానీ అది బలహీనత కాదు. మనిషిని గట్టిగా మార్చే పాఠం.

ఇక్కడ నవ్వు ఉంది డబ్బులు పోయిన ట్రిప్‌లో కూడా మర్చిపోలేని నవ్వు.

ఇక్కడ వేదన ఉంది సమాజం వినిపించని స్వరం, మనసులో దాచుకున్న ఒంటరితనం.

ఈ పుస్తకాన్ని చదివేటప్పుడు, కథలని కాదు మనుషులని చదవండి. వారి తప్పులని కాదు వారి పోరాటాన్ని చూడండి. వారి ఓటమిని కాదు వారి లేచే శక్తిని గమనించండి. ఎందుకంటే, ప్రేమ విరిగినా మనిషి విరగకూడదు. కష్టం వచ్చినా మనసు చచ్చిపోవకూడదు.

**ఒకసారి పడిపోయినా.. మళ్లీ లేచే ధైర్యమే జీవితం.**

ఈ కథలు మీ కన్నీళ్లను మాత్రమే కాదు, మీ లోపల దాగున్న బలాన్ని కూడా గుర్తు చేస్తాయని నమ్ముతున్నాను. ఈ పుస్తకం మీ చేతిలో ఉంటే, మీరు ఒంటరిగా లేరని ఎక్కడో ఒక చోట మీలాంటి మనిషి కూడా ఇదే పోరాటం చేస్తున్నాడని ఈ కథలు మీకు చెప్పాలి. అదే ఈ పుస్తకం ఉద్దేశ్యం.

ఈ పదహారు కథలు మీ జీవితానికి అద్దంలా మారాలని, మీ ఆలోచనలకు తోడుగా నిలవాలని, మీ మౌనాలకు ఒక స్వరం ఇవ్వాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నాను.

ఈ పుస్తకం చదివిన తర్వాత మీరు కొంచెం ఆగి ఆలోచిస్తే, లేదా ఎవరో ఒకరిని గుర్తుచేసుకుంటే, లేదా మీలోని ఏదో ఒక భావాన్ని నెమ్మదిగా అంగీకరిస్తే అదే నా రచనకు లభించిన నిజమైన బహుమతి.

మనసు పలికిన ఈ పదహారు కథలు మీ హృదయంలో ఒక చిన్న మచ్చలా మిగిలితే, అదే నా సంపూర్ణ సంతృప్తి.

— **మణికంఠ శంకు (ఎజె)**

# కథా వరుస

1. నా పేరు కాదు, నా స్థాయి కాదు.. నా నిజం మాట్లాడింది.

2. మట్టిలో మందు బాటిల్ –నవ్వుతూ బతుకు అంతే.

3. ఒక గొప్ప అబద్ధం.

4. కులు –మనాలి——నన్ను నేను కనుక్కున్న ప్రదేశం.

5. పండగ టూర్.. పంచాయతీ వాపస్.

6. ఆమె ఇంకా అక్కడే ఉంది.

7. నా చివరి రోజు.. వారి చివరి ఆశ.

8. గోవిందా..! మా పర్సులా!

9. నా ప్రేమకు సుకన్య నీడ.. రాధిక దీపం.

10. హిజ్రా–మా ఊహలు వేసిన గోడలు.

11. వరల్డ్ కప్– ఒక క్రికెటర్ ప్రయాణం.

12. హీరోలా జీవించాలనుకున్న రాము.. నిజమైన హీరో అయిన రోజు

13. ప్రేమను రాయాలి అనుకున్నాను, కానీ ప్రేమే నన్ను రాసుకుంది.

14. ప్రేమలో పడిన అబ్బాయిలు.. జీవితంలో లేచిన మగాళ్లు.

15. స్నేహితుల కోసం ఇచ్చిన మనసు.

16. మానస వెళ్లిపోయింది.. కానీ సురేష్ మళ్ళీ బతికాడు

# 1. నా పేరు కాదు, నా స్థాయి కాదు.. నా నిజం మాట్లాడింది

నా పేరు యస్. రానా సంతోష్,

ముందు నా ఇంటి పేరు మొదటి అక్షరం యస్ అని ఎందుకు రాసానో నా జీవితంలో ఎదురైన సంఘటన చెప్తుంది.

స్కూల్ రోజులు..

అవి నవ్వులని, బాధలని ఒకేసారి నేర్పించే రోజులు. అప్పుడే మొదటిసారి తెలుసుకున్నాను. మనసుకి పెట్టే ముద్రలు మార్కుల కంటే గాఢంగా ఉంటాయి. మా క్లాస్‌లో విద్యార్థులను ఎప్పుడూ రెండు గ్రూపులుగా చూస్తారు.

"టాపర్స్"

"అవరేజ్ స్టూడెంట్స్"

ఇవే రెండు పేర్లు, ఇవే రెండు గీతలు. ఆ గీతల్లో నేను ఎప్పుడూ రెండో వైపునే. అంటే 'అవరేజ్ స్టూడెంట్' ఇది నాకేమీ అనిపించేది కాదు.. కానీ ఇతరుల చూపు, ఇతరుల మాట, ఇతరుల అంచనా, ఇవి మాత్రం ప్రతిరోజూ నా పేరుకన్నా గట్టిగా వినబడేవి.

## యూనిట్ టెస్ట్.. నా చిన్న పోరాటం

ఆ యూనిట్ టెస్ట్ నాకు చాల ప్రత్యేకం. ప్రశ్న పత్రం చెల్లాచెదురు అయిపోయినట్లే, నేను భయంతో కొంచెం వణికినా లోపల పట్టుదల మాత్రం గట్టిగా పట్టుకుంది.

ఆ రోజు ప్రశ్నలన్నీ చూసిన క్షణాన 'ఇది రాయగలను, ఈసారి బాగా రాస్తాను' అని నా మనసు నన్ను నడిపించింది.

పెన్ చివర పేపర్‌పై దూసుకెళ్తూ ఉండగా.. నాకు ఒకసారి కూడా సందేహం రాలేదు. మొదటిసారి.. మరి నిజంగా మొదటిసారి. నాకు నేను ఇంప్రెస్ అయ్యాను. పరీక్ష ముగిసినప్పుడు నా హృదయం తేలికగా తేలుతూ.. 'ఈసారి చాలా బాగా రాసాను.' అన్న మాట నాకు నేనే చెప్పుకున్నాను.

కొన్ని రోజుల తర్వాత కరక్షన్ అయిపోయి, మా సైన్స్ సార్ క్లాస్‌లోకి పేపర్స్ తీసుకుని వచ్చారు. అతని అడుగుల శబ్దం కూడా క్లాస్ మొత్తాన్ని టెన్షన్‌తో నింపగల అలజడి కనిపిస్తుంది.

అతను టేబుల్ మీద పేపర్స్ పెట్టి రిజిస్టర్ చూస్తున్నారు. నేను నా స్నేహితుడు బోర్డు తుడుద్దామని వెళ్ళి మార్క్స్ మెల్లగా చూసాం. అంతే షాక్..! క్లాస్ టాపర్స్ కంటే నాకే ఎక్కువ మార్కులు వచ్చాయి **21/25**.

నా హృదయం ఒక్కసారిగా గంతులేసింది. ఒక చిన్న విజయం కూడా ఎప్పుడూ రుచి చూడని మనసుకు అది పండుగలా

అనిపించింది. సర్ పేర్లు చదవడం మొదలుపెట్టారు. చాలా గర్వంగా లోపల ఉంది, నా పేరు, మార్క్స్ చెప్పగానే అందరు ఆశ్చర్యపోతారు అనుకున్నాను.

నా చేతి వేళ్లు మెల్లగా తడబడుతున్నాయి.

**"యస్.రానా సంతోష్ —— 21 మార్క్స్."**

నా లోపల "అదే నేను! ఇదే నా రోజు!" అని

గట్టిగా కేక పెట్టుకున్నాను.

చిన్నా పాటి గర్వంతో కుర్చీని నెమ్మదిగా తోసి లేచాను.

కానీ.. సర్ ముఖం మాత్రం – నా ఆనందాన్ని ఒక్క సెకనులోనే నిరాశగా మార్చింది. ఎందుకో నా వైపు ఒకసారిగా ఆశ్చర్యంగా చూశారు.

ఆ చూపులో ఆశ్చర్యం ఉన్నా.. ఏదో తప్పిదం అయిందన్న భావం కళ్లల్లో కనపడుతుంది.


సర్ "ఒరేయ్ యస్. రానా సంతోష్ అంటే నువ్వా? నేను ఆ రానా సంతోష్ అనుకున్నానే."

అవును, అతను అన్నది నిజమే. మా క్లాసులో ఇద్దరు రానా సంతోష్‌లు ఉన్నారు.

ఒకటి నేను అవరేజ్ స్టూడెంట్, ఇంకొకరు టాపర్ '**ఎల్. రానా సంతోష్**.'

నన్ను ఆ ఎల్. రానా సంతోష్ అనుకొని 'అనవసరంగా వీడికి ఎక్కువ మార్కులు వేసాను' అని సర్ సైడ్‌కు తిరిగి అనుకుంటున్నారు.

"సరేలే, ఇదిగో తీసుకో" అని పేపర్ చాలా నిరాశగా ఇచ్చారు.



నేను పేపర్ తీసుకున్నాను కానీ చేతితో కాదు.. **గుండెల్లో జారిన కన్నీటితో.**

నన్ను కాదు.. నా మీద వారి అభిప్రాయాన్ని నమ్మారు. ఆ రోజు నేనొకటి నేర్చుకున్నాను. ఈ ప్రపంచంలో చాలా సార్లు

**నీ ఆన్సర్ షీట్ కన్నా**

**నీ స్థానానికి ఎక్కువ మార్కులు తెస్తుంది.**

వాళ్లు నా శ్రమను నమ్మలేదు. నా మెరుగుదలను నమ్మలేదు. నా సామర్థ్యాన్ని నమ్మలేదు. ఆ రోజు సాయంత్రం ఇంటికి వచ్చాక పేపర్‌పై 21 అనే నెంబర్ కంటే, సర్ చూపు నా మనసులో పెద్ద గాయం చేసింది.

కొన్ని రోజులకి ఎక్కడో ప్రశ్న వచ్చింది –

**'నన్ను నమ్మితేనే నేను ఎదగగలను కదా..! వారు నాలో చూసేది నేను రాసిన సమాధానాలు కాదు, వారి మనసులో ఇప్పటికే వేసిన – 'యస్. రానా సంతోష్ స్థాయి' అనే లేబుల్ మాత్రమే.'**

అయినా ఆ బాధ నన్ను విరగ్గొట్టలేదు. అది నన్ను నడిపించింది. ఇప్పుడు పెద్దయ్యాక అర్థమవుతుంది.

ఒక విద్యార్థికి ఎందుకు సపోర్ట్ కావాలో.. ఎందుకు ఒక మంచి మాట కావాలో..

'నువ్వు అనుకుంటే చెయ్యగలవు' అనే ఒక నమ్మకం ఎందుకు అవసరమో.. ఎందుకంటే——

**"ఓ చిన్న ప్రోత్సాహమే ఓ సాధారణ స్టూడెంట్‌ను టాపర్‌గా మార్చగలదు."**

అదృష్టవశాత్తు నేను బాధని ఇంధనంగా మార్చుకోగలిగాను. అది నన్ను ఇంకా మెచ్యూర్ చేసింది. కానీ ప్రతిదినం ఇలాంటి చూపులు, ఇలాంటి లేబుల్స్, ఇలాంటి తేడాలు, ఇంకొకరితో పోల్చడాలు, ఎంతమందిని లోపల పడగొడుతున్నాయో ఎవరికీ తెలియదు.

**"ఓ విద్యార్థి రాసే మార్కులు కాదు, అతనికి ప్రపంచం రాసిన పేరు అతని భవిష్యత్తు మార్చేస్తుంది."**

**"నన్ను నమ్మకపోయినా పర్లేదు.. నిన్ను నువ్వు నమ్మితే చాలు."**

**"ఎవరు నిన్ను ఎలా చూసినా, నువ్వు అనుకున్నదాని కోసం నిజాయితీగా ప్రయత్నం చేసుకుంటూ పో."**

**"ఒక చిన్న నమ్మకమైన మాట,**
**పెద్ద టాలెంట్‌ని మేల్కొలుపుతుంది.**

**"స్థాయి అనేది మనసు నిర్ణయించేది.. ఇతరుల మాటలు కాదు."**